ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సంక్షేమం ఆగదు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నాచేపల్లి-భైరవునిపల్లి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి(నేలకొండల పల్లి), జూన్ 3: రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపకుండా గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలు ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలంలో మంగళవారం సుమారు రూ, 5.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన పనులను మంత్రి ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు చేశారు. భైరవునిపల్లి–నాచేపల్లి రోడ్డుకు రూ.4.74 కోట్లతో రహదారి నిర్మాణానికి, రూ.30 లక్షలతో నేలకొండపల్లిలో సీసీ రోడ్లకు, చెన్నారంలో రూ.22 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముజ్జుగూడెంలో రూ, 16 లక్షలతో పశువుల ఆసుపత్రి సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం బోదులబండలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన శంకుస్థాపన చేశారు. మొదటి విడలో రాని వారికి రెండో విడతలో ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహరావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా పశు సంవర్ధఖ శాఖ అధికారి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాసరావు, ఏడీఏ సరిత, సీఐ సంజీవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు, నాయకులు పాల్గొన్నారు.

బాలరాజు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి

మధిర, జూన్ 3: మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దారా బాలరాజు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత బాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు డాక్టర్ కోట రాంబాబు, సూరంశెట్టి కిషోర్, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, కటికల సీతారామిరెడ్డి, నిడమానూరి వంశీ, అద్దంకి రవి, కర్నాటి రామారావు ఉన్నారు.

పారిశుధ్యంపై వంద రోజుల కార్యాచరణ

ఖమ్మం, జూన్ 3: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్యం నిర్వహణపై వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పలు డివిజన్లలో కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. పర్యటనలో భాగంగా కమిషనర్.. డ్రై క్లీనింగ్, బుష్ కటింగ్, ఓపెన్ ప్లాట్ క్లీనింగ్, దోమల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా ఎక్కడా నీరు నిలిచే అవకాశం లేకుండా చూడాలన్నారు. ఈ క్రమంలో 13, 21, 37, 50వ డివిజన్లలో 20 మంది వర్కర్లతో ప్రత్యేకంగా గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి చెత్తను తొలగించాలని ఆయన ఆదేశించారు.

వార్డుల డ్రాఫ్టు నోటిఫికేషన్ విడుదల

ఖమ్మం రూరల్, జూన్ 3: ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేయబోయే వార్డుల విభజనకు సంబంధించిన డ్రాఫ్టు నోటిఫికేషన్‌ను కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మంగళవారం విడుదల చేశారు. మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ వార్డుల విభజనకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఐదురోజులలోపు దరఖాస్తులు ఇవ్వవచ్చని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 32 డివిజన్లుగా విభజన చేసి, డ్రాఫ్టు తయారు చేయడం జరిగిందన్నారు. 4వ తేదీన ముసాయిదను కార్యాలయంలో ప్రదర్శించి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అందజేస్తామన్నారు. 5నుంచి 11వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, 12 నుంచి 16వ తేదీ వరకు స్వీకరించిన ఫిర్యాదులను విచారణ చేపడతామని, 17వ తేదీన తుది ముసాయిదను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. 19వ తేదీన రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు అప్రువల్ నిమిత్తం పంపిస్తామని, 21వ తేదీన అధికారికంగా మున్సిపల్ డివిజన్ల వివరాలను విడుదల చేస్తామన్నారు.

పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ముదిగొండ, జూన్ 3: నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామమని సీఐ మురళీ హెచ్చరించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలంలోని వల్లభి శివారులో అంతరాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశారు. పండుగ పేరుతో ఎవ్వరూ నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా చేయవద్దని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

తిరుమలాయపాలెం, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని పిండిప్రోలు జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం ఎంవీఎన్.జ్యోతి తల్లిదండ్రులను కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బీచరాజుపల్లి, రమణతండా, వెదుళ్లచెరువు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాలి, తులసి, లలితకుమారి పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఇళ్లు నిర్మించుకోవాలి

పెనుబల్లి, జూన్ 3: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో అన్నపూర్ణమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని వీఎం.బంజరలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు భూక్యా నాగమణి, జూపాటి లావణ్యలు ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శిరీష, నాయకులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, మేకతోటి కాంతయ్య, గోగినేని రమేశ్, భూక్యా ప్రసాద్, బాజీనాయక్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 నాటికి భూ సమస్యలు పరిష్కారం

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల, పొంగులేటి,

ఎర్రుపాలెం, జూన్ 3 : భూ భారతి చట్టం ద్వారా ఆగస్టు 15వ తేదీ నాటికి రైతుల భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలంలోని మొలుగుమాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, హౌసింగ్‌శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజలకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారుల దగ్గర పరిష్కరించేకునేలా అప్పిల్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూ సర్వే చేసి నిఖార్సైన రికార్డులు తయారు చేస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ల అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ మొలుగుమాడు గ్రామంలో ఉన్న ప్రతి ఇంచు సర్వే చేసి పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు, మ్యాప్ కూడా భూహక్కుదారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్‌పీ.శ్రీనివాస్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జేడీ ప్రసన్నలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహసీల్దార్ ఉషాశారద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇందిరాడెయిరీల ఏర్పాటు

మధిర, జూన్ 3: మధిర నియోజకవర్గంలో చేపట్టిన ఇందిఆ డెయిరీని అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిరలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి డీఆర్డీవో, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇందిరాడెయిరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందజేయాలని, సభ్యులు ఎటువంటి కంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరా డెయిరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీటీడబ్ల్యూవో విజయలక్ష్మి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీవీహెచ్‌వో శ్రీనివాసరావు, డీఏవో పుల్లయ్య, డీబీసీడీవో జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ నవీన్‌బాబు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు

హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తల్లాడ/కొణిజర్ల, జూన్ 3: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, కొణిజర్ల మాజీ జడ్పీటీసీ పోట్ల కవిత, పోట్ల శ్రీనివాసరావు దంపతులు మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో వేర్వేరుగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పార్టీ స్థితిగతులను తెలుసుకొని పార్టీ అభివృద్ధికి కష్టపడాలని సూచించినట్లు వారు తెలిపారు.

సీఎంవోకు ఏఎంవోగా అదనపు బాధ్యతలు

రాజశేఖర్

ఖమ్మం అర్బన్, జూన్ 3 : జిల్లా విద్యా శాఖలో సీఎంవోగా పనిచేస్తున్న యలగందుల రాజశేఖర్‌కు ఏఎంవో(అకడమిక్ మానిటరింగ్ అధికారి)గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డీఈవో సామినేని సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కూడా ఆయన ఏఎంవోగా అదనపు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడంతో డీఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఏఎంవోగా పనిచేసిన కే రవికుమార్ ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో న్యూవిజన్ విద్యార్థి సత్తా

ప్రణవ్‌ను అభినందిస్తున్న న్యూవిజన్ కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్

ఖమ్మం అర్బన్, జూన్ 3: కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయవచ్చని నిరూపించారు న్యూవిజన్ విద్యార్థులు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పోటీ పరీక్షల్లో జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించి ఖమ్మం జిల్లాకు పేరు తెచ్చారు. ఖమ్మం నగరంలోని న్యూవిజన్ కళాశాలకు చెందిన విద్యార్థి పేరాల ప్రణవ్ ఓపెన్ కేటగిరిలో 497 ర్యాంక్‌తో సత్తా చాటాడు. కళాశాల యాజమాన్యం తనను ఎంతగానో ప్రోత్సహించిందని ఈ సందర్భంగా ప్రణవ్ తెలిపారు.

బడిబాట ప్రచార బైక్‌యాత్ర ప్రారంభం

సత్తుపల్లి, జూన్ 3: కల్లూరు మండలంలోని చెన్నూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దంతాల సుధాకర్ చేపట్టిన బడిబాట ప్రచార బైక్ యాత్రను ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఈవో సామినేని సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ స్వచ్ఛందంగా బడిబాట ప్రచార యాత్ర చేస్తున్న సుధాకర్‌ను అభినందిస్తూ పిల్లలందరూ మీ ఊరి ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని కోరారు. డీఈవో సత్యానారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఖమ్మం రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్, కారేపల్లి: ప్రజలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఖమ్మం రూరల్, జూన్ 3: భూ సమస్యలు పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని రూరల్ తహసీల్దార్ పీ రాంప్రసాద్ అన్నారు. మండలంలో పందొమ్మిది రోజుల పాటు కొనసాగే రెవెన్యూ సదస్సులను మంగళవారం తహసీల్దార్ ప్రారంభించారు. మొదటి రోజు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని బారుగూడెంలో, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో పల్లెగూడెంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ బైరు హరినాదబాబు, ఆర్ ఐలు ప్రసాద్, క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.

కొక్కిరేణి, సుబ్లేడులో..

తిరుమలాయపాలెం, జూన్ 3: మండలంలోని కొక్కిరేణి, సుబ్లేడులో మొదటిరోజు భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కొక్కిరేణిలో తహసీల్దార్ లూథర్ విల్సన్, సుబ్లేడులో డీటీ సుధీర్ ఆధ్వర్యంలో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కొక్కిరేణిలో 85, సుబ్లేడులో 91 దరఖాస్తులు వచ్చాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముదిగొండ మండలంలో..

ముదిగొండ, జూన్ 3: మండలంలోని యడవల్లి, యడవల్లి లక్ష్మీపురం, అమ్మపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ సునీత ఎల్లెబిత్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మధిర మండలంలో..

మధిర, జూన్ 3: భూభారతి రైతుసదస్సులో 63 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రాచబండి రాంబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లారం, జాలిముడి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురంలో..

వైరాటౌన్, జూన్ 3: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో వైరా తహసీల్దార్ కెవి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. 31 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రెవెన్యూ సదస్సులకు ఆదరణ కరువు

కారేపల్లి, జూన్ 3: రెవెన్యూ సదస్సులకు ప్రజాదారణ కరువైంది. మొదటి రోజు మండల కేంద్రం(కారేపల్లి), గిద్దవారిగూడెం, వెంకిట్యాతండా పంచాయతీల్లో అధికారులు అట్టహాసంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారుల రాక కోసం అధికారులు ఎదురు చూసినా.. ప్రజలు మాత్రం వేదిక వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నవి.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం, జూన్ 3 : భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత పేర్కొన్నారు. మంగళవారం కోయచలక, వీ వెంకటాయపాలెం రెవెన్యూ గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు ఇచ్చి రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ మురళీధర్‌రావు, గిర్దావర్‌లు సత్యనారాయణ, ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్‌లు నాగరాజు, నాగేంద్రబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లలో అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోను..

కాంగ్రెస్ నాయకుడు గోపాల్ నాయక్

మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

కారేపల్లి, జూన్ 3: అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు దక్కడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ సింగరేణి మండల అధ్యక్షుడు, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీ సభ్యుడు వాంకుడోత్ గోపాల్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వెంకిట్యాతండా పంచాయతీకి 12 ఇండ్లు మంజూరు కాగా కొంతమంది అనర్హులు ఉన్నారని ఆరోపించారు. తనకు తెలియకుండానే లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఈ విషయమై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు తాను పోరాడుతానని స్పష్టం చేశారు.

కరాటే టోర్నమెంట్ విజేతలకు అభినందన

వైరాటౌన్, జూన్ 3: ఏబీఎస్‌కెవో కరాటే అసోసియేషన్ వైరా కరాటే మాస్టర్ రఘు ఆధ్వర్యంలో 1 గోల్డ్, 3 సిల్వర్, 9 బ్రౌన్ మెడల్‌లు సాధించిన చిన్నారులను వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు అభినందించారు. మున్ముందు మరెన్నో నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనాలని, వైరాకి మంచి పేరు తీసుకురావాలని రఘుని ప్రత్యేకంగా కోరారు. కార్యక్రమంలో మాస్టర్ రఘుతో పాటు మాస్టర్ గోపి, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేంసూరు ఎస్సీహాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నాగరాజు

వేంసూరు, జూన్ 3: వేంసూరులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం సంక్షేమ అధికారిగా ఖమ్మం జిల్లా తిరుమలయాపాలెం మండలం బుచ్చోడు గ్రామానికి చెందిన డాక్టర్ తిమ్మిడి నాగరాజు మంగళవారం సత్తుపల్లి ఏఎస్‌సీడీవో ఎం.వీరయ్య సమక్షంలో ఇన్‌చార్జి హెచ్‌డబ్ల్యూఓ సీహెచ్.కృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

బీఆర్ఎస్ కార్యకర్త వెంకటేష్ మృతి

తిరుమలాయపాలెం, జూన్ 3: మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పల్లి వెంకటేష్(32) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త వెంకన్న, కొవ్వూరి సత్తిరెడ్డి, మోటపోతుల శ్రీను, పసలాది మధు, పల్లి భాస్కర్, నాగేశ్వరావులు వెంకటేష్ భౌతికకాయాన్ని సందర్శించి భౌతికకాయంపై గులాబి జెండా కప్పి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో కార్యకర్తలు, నాయకులు కొత్త నాగరాజు, పసలాది నవీన్, విగ్నేష్, మల్లేష్, నరేష్ వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే ఆశించిన దిగుబడులు

వేంసూరు: విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఖమ్మం రూరల్, జూన్ 3: నాణ్యమైన విత్తనాలు విత్తుకుంటేనే ఆశించిన దిగుబడులు పొందవచ్చని మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరి హరినాదబాబు అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పొన్నెకల్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సరఫరా చేసిన విత్తన సంచులను కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు బీ సరితతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ డైరెక్టర్లు మురళి, రంగారావు, మహేశ్, మం డల వ్యవసాయ శాఖ అధికారి ఉమా నగేష్, విస్తరణ అధికారులు వంశీ, ఆదర్శ్, కావ్య, హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, జూన్3: 'నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విశ్వ విద్యాల యం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా పంపిన విత్తనాలను పెనుబల్లి రైతు వేదికలో మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, గ్రామస్తులు, వ్యవసాయ అధికారి ప్రసాదరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు కే.నరేష్, లక్ష్మీభార్గవి, జీ.నాగరాజు, షర్మిద, ఎన్ఎస్‌వీ.సమంత, హర్షనందిని పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ, జూన్ 3: వ్యవసాయ శాఖ, వ్యవసాయ యూ నివర్సిటీ చేపట్టిన విత్తు కొద్ది పంట కార్యక్రమంలో భాగం గా అభ్యుదయ రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన విత్తనాలను కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్ మంగళవారం తల్లాడ రైతువేదికలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వేంసూరులో..

వేంసూరు, జూన్ 3: నాణ్యమైన విత్తనం– రైతుకు నే స్తం కార్యక్రమంలో భాగంగా మండలంలో 14 రెవెన్యూ గ్రామాల్లో రైతులకు మంగళవారం వేంసూరు రైతు వేదికలో అధికారులు విత్తనాలు పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్త బీ.శివ, ఏవో రామ్మోహన్, ఏఈవో కావ్య, నవ్య, అక్షర, రీమా, స్వాతి, వేంసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు టీ.గోపాల కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మీనవోలులో..

ఎర్రుపాలెం, జూన్ 3: మండలంలోని మీనవోలు రైతువేదికలో మండలంలోని అన్ని గ్రామాలకు, గ్రామానికి ముగ్గురు చొప్పున రైతులను ఎంపిక చేసి ఆ రైతులకు వరి, పెసర విత్తనాలను జిల్లా వ్యవసాయ అధికారి డీ.పుల్లయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సాయిశివ, ఏఈవోలు బాలకృష్ణ, వంశీకృష్ణ, గోపి, సింధూర్, కృష్ణ కుమారి, రైతులు పాల్గొన్నారు.

చింతకానిలో..

మధిర, జూన్ 3: చింతకాని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విత్తనాలను ప్రతి గ్రామానికి ముగ్గురు చొప్పున వరి, పెసర విత్తనాలను ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, రైతు శిక్షణ కేంద్రం జాయిం ట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కే.అభిమన్యుడు, రైతు శిక్షణ కేం ద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సతీష్, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కర్‌రావు, కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం శాస్త్రవేత్త ఎస్. నవీన్‌లు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎస్. మాన స, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆయేషా, రాము, తేజ, తహీయా, కార్తీక్, కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతిఒక్కరూ పాటుపడాలి

అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు

మామిళ్లగూడెం, జూన్ 3 : బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రతిఒక్కరూ మత సామరస్యానికి పాటుపడాలని అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్) ప్రసాదరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మంగళవారం ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా పోలీసు అధికారులు అన్ని భద్రతా ఏర్పాటు పూర్తి చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీఐలు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మం రూరల్, జూన్ 3: ఖమ్మం గ్రానైట్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యుడు గండు సుధాకర్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అసోసియేషన్ బాధ్యులు మంగళవారం ఏదులాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి అసోసియేషన్ తరుపున రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండారు మధుకర్ గౌడ్, సభ్యులు అప్పనపల్లి వెంకన్న, ఏ.నరేశ్, నవీన్, భద్రం, వెంకటేష్, రాజు, వీరన్న, ముత్యాలరావు, ఆదినారాయణ, సురేశ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

INDUSIND BANK LTD.
COMMERCIAL VECHILE FOR SALE
1). AP20TB8989, TATA LPT 3118 TC52 BSIII, 12 TYRE TIPPER, YEAR 2012
Cell:9959445835
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఖమ్మంలో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


వీరబాబు (ఫైల్)

రఘునాథపాలెం, జూన్ 3: కాంగ్రెస్ సర్కారులో అన్నదాతల ఆత్మహత్యలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కర్షకులను నిర్లక్ష్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది. రైతుభరోసా అందిస్తున్నామని, రుణమాఫీ చేశామని మాటలు చెబుతు మభ్యపెడుతూ రైతులను మోసం చేస్తోంది. దీంతో అన్నదాతలు ఆత్మహత్యనే శరణ్యంగా భావిస్తున్నారు. తాజాగా ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన రైతు సోమవారం రాత్రి పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయి చేసిన అప్పులు తీర్చే స్తోమత లేకపోవడంతో ఆత్మహత్యనే ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పురుగులమందు తాగి బలవణ్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిమ్మపూడి గ్రామానికి చెందిన పరిమిశెట్టి వీరబాబు (55) వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న మూడెకరాలకు తోడు మరికొంత భూమిని కౌలు తీసుకొని పత్తి, మిర్చి సాగుచేశాడు. వ్యవసాయం నిమిత్తం పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. నిరుడు ఆరెకరాల్లో పత్తి, మిర్చి సాగు చేయగా దెబ్బతిన్నది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమైంది. పంటలు కొంతమేర దెబ్బతినగా.. వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లేకుండా పోయింది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురైన వీరబాబు సోమవారం రాత్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిచెందిన రైతు వీరబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

వాటర్‌ట్యాంక్ కూలి కార్మికుడి మృతి

మామిళ్లగూడెం, జూన్ 3: ప్రమాదశావత్తు వాటర్ ట్యాంక్ కూలి కార్మికుడు మృతిచెందిన ఘటన మంగళవారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి చిరంజీవి(34) వడ్డెర పని చేసుకుని జీవిస్తున్నాడు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు చెందిన మార్కెటింగ్ కార్యాలయం పక్కన ఉన్న ఓ పాత వాటర్‌ట్యాంక్‌ను తొలగించేందుకు మార్కెట్‌కు చెందిన వారితో కొంత డబ్బులకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ట్యాంక్ పిల్లర్ల ఐరన్‌ను కట్ చేస్తుండగా ఒక్కసారిగా ట్యాంక్ చిరంజీవిపై పడింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు మూడో పట్టణ సీఐ మోహన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిరంజీవికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ..చిన్నారి మృతి


బృంద (ఫైల్)

ఖమ్మం రూరల్, జూన్ 3: రోడ్డు ప్రమాదంలో ఓ నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం ఏదులాపురం క్రాస్‌రోడ్డు వద్ద చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన కోసూరి అప్పారావు తన కూతురు బృంద (4)తో కలిసి తన మిత్రుడి ఆటోలో ఏదులాపురం నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏదులాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను పక్కకు ఆపారు.ఈ సమయంలోనే వరంగల్ నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఓ లారీ వెనుక నుంచి వచ్చి అదుపు తప్పి ఆటోను ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో ఆటోలో ఉన్న చిన్నారి అక్కడికక్కడే మృతి చెందంది. చిన్నారి మరణ వార్త తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో ఉన్న చిన్నారి మృతదేహాన్ని సందర్శించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.